క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మైలవరం: మంగళవారం ఉదయం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ జి. రమేష్‌బాబు తెలిపారు. తిరువూరు రోడ్డు, సిద్దిపేట, బందగర్, రామకృష్ణ కాలనీ, ఎస్‌వీఎస్ నగర్, పాందుగల రోడ్డు, సుగాలి కాలనీ, బస్టాండ్, రైతు బజారు, ఎంపీడీఓ కార్యాలయం రోడ్డు, మూడు బొమ్మల సెంటర్, పోస్టాఫీస్ రోడ్డు, కుమ్మరి వీధి, శివాలయం వీధి, నూజివీడు రోడ్డు, విజయవాడ రోడ్డు హాజీపేట, శివాజీ వీధి, భవానీ నగర్ ప్రాంతాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

● భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ రాయనపాడు ఫీడర్ లైన్ల మరమ్మతులలో భాగంగా పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఈఈ బీవీ సుధాకర్ తెలిపారు. ఖలీల్ భాయ్ రెస్టారెంట్ ఏరియా, సీజన్ స్టే ఫంక్షన్ హాల్ ఏరియా, సీఎన్జీ బస్ చార్జింగ్ స్టేషన్, రాయకృష్ణ ట్రాన్స్పోర్టర్స్ ఏరియా, విజయవాడ కోల్డ్ స్టోరేజ్ ఏరియా, ముత్తవరపు స్వర్ణ గార్డెన్స్ ఏరియాలలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

వంతెన నిర్మాణానికి సీఎస్ఆర్ నిధులు కేటాయించాలి



తుమ్మలపాలెం(ఇబ్రహీంపట్నం): తుమ్మలపాలెంలో ఎన్టీటీపీఎస్ కాలువపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరిందని ఎంపీటీసీ సభ్యుడు పాలిశెట్టి తేజ అన్నారు. వంతెన స్థానంలో నూతన వంతెన నిర్మాణానికి సీఎస్ఆర్ నిధులు కేటాయించేందుకు చర్యలు చేపట్టాలని విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సృజనకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఇటీవలి కాలంలో ఎన్టీటీపీఎస్ సంస్థ సుమారు రూ.4 కోట్లు సీఎస్ఆర్ నిధులు కేటాయించిందన్నారు. వాటిలో రూ.1.50 కోట్లు వంతెనకు మంజూరు చేయాలని కోరారు. ఎన్టీటీపీఎస్ సంస్థ నుంచి ఇంకా రావల్సిన రూ.26 కోట్లు కూడా తక్షణం విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాలుష్య నియంత్రణకు చర్యలు చేపట్టేలా సంస్థకు ఆదేశాలు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



తిరువూరు: తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల ఉపాధ్యాయుల పరస్పర సహకార సంఘ కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్. సంజీవరెడ్డి, వి. శేషగిరిరావు, కార్యదర్శిగా ఎం. నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని సభ్యులు అభినందించారు.

పోటీ పరీక్షల మెటీరియల్ పంపిణీ



గానుగపాడు(తిరువూరురూరల్): మండలంలోని గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం పలు పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ అభ్యర్థులకు పోటీ పరీక్షల మెటీరియల్‌ను ప్రధానోపాధ్యాయిని ఆదిలక్ష్మి పంపిణీ చేశారు. గ్రామాన్ని దత్తత తీసుకున్న పాఠశాల ఆంగ్లోపాధ్యాయుడు రాంప్రదీప్ చొరవతో తిరువూరుకు చెందిన దాత కె. దుర్గాప్రసాద్ వితరణ ఇచ్చిన ఇంగ్లిష్, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను అభ్యర్థులకు అందజేశారు.

కోట మహిషమ్మ ఆలయంలో తనిఖీలు



నూజివీడు: దేవదాయ శాఖ కాకినాడ డెప్యూటీ కమిషనర్ విజయరాజు నూజివీడులోని కోట మహిషాసురమర్దిని అమ్మవారి ఆలయాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయనకు అర్చకులు స్వాగతం పలికారు. ఆలయ కార్యనిర్వహణాధికారిని ఆయన పలు వివరాలు అడిగి తెలుసుకుని, రికార్డులు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇది పురాతన ఆలయమవడంతో శ్లాబు నుంచి నీరు కారుతోందని, ఆలయ మరమ్మతుల కోసం సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ద్వారా దేవదాయ శాఖ మంత్రిని కలిశామని, త్వరలోనే ఆలయ శ్లాబు మరమ్మతులు చేపడతామని విజయరాజు తెలిపారు.

విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి కృషి



మైలవరం ఎంపీపీ పాఠశాలలో భోజనం వడ్డిస్తున్న దాతలు



: గంపలగూడెం హైస్కూల్‌లో విద్యార్థులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ పుల్లమ్మ

మైలవరం: విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి దాతల సహకారంతో కృషి చేయాలని మైలవరం ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. గోపాల్ అన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా శుభతిథి భోజనం పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. శుభతిథి భోజనంలో విద్యార్థులకు స్వీట్లు, అరటిపండు, ఫ్రైడ్ రైస్ వడ్డించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు దుర్గారావు, బి. వెంకట్రావు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ ధనలక్ష్మి, వైస్ చైర్మన్ సరస్వతి పాల్గొన్నారు. మైలవరం జెడ్పీ ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో దాత, వ్యాపారి బయన శ్రీనివాసరావు దంపతుల ఆధ్వర్యంలో విద్యార్థినులకు తిధి భోజనంలో భాగంగా స్వీట్లు పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● గంపలగూడెం: శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా ఏడో రోజు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం తిధి భోజనం నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతోపాటు దాతల సహకారంతో పండ్లు, పాయసం, స్వీట్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ పీవీడీఎల్ నరసింహారావు మాట్లాడుతూ పౌష్టికాహారం అవశ్యకతను వివరించారు. ప్రభుత్వ ఆదేశానుసారం తిధి భోజనం విద్యార్థులకు పంపిణీ చేశామని చెప్పారు.

● చాట్రాయి: శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో తిధి భోజనం దాతల సహకారంతో విద్యార్థులకు అందించారు. మండలంలోని పోలవరం ప్రాథమిక పాఠశాల్లో దాత మరిడి చిట్టిబాబు ఆధ్వర్యంలో ఎంఈఓ బ్రహ్మచారి విద్యార్థులకు భోజనం అందించారు.

● నూజివీడు: మండలంలోని పలు పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా తిధి భోజనం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. గొల్లపల్లి హైస్కూల్‌లో దాతల సహకారంతో విద్యార్థులకు రోజువారీ మధ్యాహ్న భోజనంతోపాటు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. హెచ్ఎం పొట్లూరి రాధికారాణి మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని కోరారు. గ్రామస్తులు గోగినేని లక్ష్మి, పలగాని వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



గొల్లపల్లి హైస్కూల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న గ్రామస్తులు

● పట్టణ పరిధి యానాది కాలనీలోని ఎంపీయూపీ స్కూల్‌లో కొసరాజు భవాని వితరణతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు స్వీటు, హాట్, అరటిపండు, పెరుగు అందజేశారు. విద్యార్థులతోపాటు గ్రామస్తులు కార్యక్రమంలో పాల్గొని భోజనం చేశారు. హెచ్ఎం సీహెచ్ ఏసుదాసు దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

● ఆగిరిపల్లి: మండలంలోని వట్టిగుడిపాడు ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఎంఈఓలు సర్వేశ్వరరావు, ఆనంద్ కుమార్‌లు పాల్గొని విద్యార్థులతో సహ పంక్తి భోజనం చేశారు. ఆగిరిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయిని పుష్పలత, ఈదర జిల్లా పరిషత్ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయిని శారద ఆధ్వర్యంలో, అమ్మవారి గుడిలోని మండల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు వంశీ వశిష్ట ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు సహపంక్తి భోజనాలు చేశారు.

తిరువూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ప్రవాసాంధ్రురాలు తాళ్లూరి అనురాధ అరటిపండ్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ శ్యామసుందరరావు తల్లిదండ్రులకు సూచించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఏఎస్‌వీ రాజేష్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఆర్. ఝాన్సీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● మల్లేల(తిరువూరురూరల్): మల్లేల జెడ్పీ ఉన్నత పాఠశాలలో మాజీ ఎంపీటీసీ గడిపర్తి హనుమంతరావు, మాజీ పీఏసీఎస్ చైర్‌పర్సన్ కలకొండ రవికుమార్‌లు విద్యార్థులకు భోజనం, మిఠాయిలు, అరటిపండ్లు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలను ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్ వివరించారు.

● ముసునూరు: ముసునూరు హైస్కూల్ హెచ్ఎం సునీల ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు తుమ్మల మధులత, అత్యుష్ల వితరణతో విద్యార్థులకు భోజనంలో స్వీట్, పెరుగు, అరటి పండ్లు అందించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు, దాతలు సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: కాచవరంలో ఎంఈఓ సీహెచ్ పుష్పలత, ఎంఈఓ-2 రత్నశ్యామ్‌బాబు శిక్ష సప్తాహ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సామాజిక భాగస్వామ్యం అందించిన పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచి నళిని ఆశాలత, హెచ్ఎం నాగమల్లేశ్వరి, ఉపాధ్యాయుడు ఇర్ఫాన్‌పాషా, సీఆర్పీ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు

మైలవరం ఎమ్మెల్యే వసంత

మైలవరం: మైలవరం నియోజకవర్గ అభివృద్ధికి రూ.22.5 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం ఆయన కూటమి నాయకులతో సమావేశమయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నుంచి మంజూరైన నిధులు వినియోగిస్తామన్నారు. జి. కొండూరు మండలానికి రూ.5 కోట్లు, మైలవరం మండలానికి రూ.5 కోట్లు, రెడ్డిగూడెం మండలానికి రూ.5 కోట్లు, ఇబ్రహీంపట్నం మండలానికి రూ.5 కోట్లతో పాటు విజయవాడ రూరల్ మండలానికి రూ.2.5 కోట్ల నిధులు కేటాయించామని చెప్పారు. ఈ నిధులతో సీసీ డ్రెయిన్లు, సీసీ రోడ్లు నిర్మిస్తామన్నారు. కూటమి నేతలందరిని కలుపుకుని ముందుకు సాగుతామన్నారు. సమావేశంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

● జి.కొండూరు: గ్రామాల అభివృద్ధికి పార్టీలకు అతీతంగా కృషి చేయాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. కొత్తరెడ్డిగూడెం గ్రామంలో స్థానిక కూటమి నాయకులు, అధికారులతో ఎమ్మెల్యే సోమవారం సమావేశం నిర్వహించారు. కూటమి నాయకులు పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందాలి

మైలవరం: హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్, జావా స్క్రిప్ట్ వంటి ప్రాథమిక భాషలతో పాటు రియాక్ట్.జేఎస్ వంటి ఫ్రేమ్ వర్క్‌లు నేర్చుకోవాలని, ఈ కొత్త నైపుణ్యాలు వెబ్ డెవలప్‌మెంట్‌లో మరింత నైపుణ్యంగా మారడానికి సహాయ పడతాయని ఎల్‌బీఆర్‌సీఈ స్టూడెంట్ బ్రాంచ్ ఇన్‌చార్జి, భావరాజు సాయి శశాంక ఇన్ఫోస్టెప్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ ఎస్. నాగాంజనేయులు అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన వారం రోజులు శిక్షణా కార్యక్రమం సోమవారం ముగిసింది. ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణలో విద్యార్థులు వెబ్ డెవలప్‌మెంట్ ప్రాథమికాలు, ఆధునిక సాంకేతికతల వరకు వివిధ అంశాలపై అవగాహన కల్పించామని వివరించారు. ఐటీ విభాగాధిపతి డాక్టర్ బి. శ్రీనివాసరావు, కో-ఆర్డినేటర్స్‌గా హేమ లత, సాంబశివరావు, శ్రీకృష్ణారెడి, విద్యార్థులు పాల్గొన్నారు.



శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులతో నాగాంజనేయులు, అధ్యాపకులు

మొక్కలు నాటి.. సంరక్షించండి



కొండపల్లి(ఇబ్రహీంపట్నం):మానవ మనుగడకు మొక్కలే ప్రధాన ఆధారమని ఏపీహెచ్ఎంఈఎల్ (ఆప్మెల్) సంస్థ మేనేజర్ వై.రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సింగరేణి సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ పిలుపుమేరకు సంస్థలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాలుష్యం నివారణ మొక్కల పెంపకంతోనే సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత చేపట్టాలని సూచించారు. ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ బాలికలకు టెస్ట్ బుక్స్ అందజేత

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి జెడ్పీ పాఠశాల ప్లస్‌లో ఇంటర్ బాలికలకు టెస్ట్ బుక్స్‌ను సోమవారం పంపిణీ చేశారు. ఎస్ఎంసీ చైర్మన్ నడకుదిటి పుష్ప, హెచ్ఎం బి.పద్మలత బాలికలకు పుస్తకాలను అందజేశారు. వారు మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యతో ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. పిల్లలు ప్రయోజకులైతే తల్లిదండ్రుల ఆనందానికి అవధులు ఉండవన్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని అర్థం చేసుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



విస్సన్నపేట: స్థానిక ఎస్సీ వాడకు చెందిన ట్రాక్టర్ కార్మికుడు మేశపాం సుధాకర్ (35) ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి విస్సన్నపేట ఎస్సీ వాడకు చెందిన బాబు జగ్జీవన్‌రామ్ యూత్ ఆధ్వర్యంలో రూ.15,500 ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు.మృతుడి కుటుంబాన్ని దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని బీజేఆర్ యూత్ నాయకులు కోరారు.

బాలికలు, మహిళలకు రక్షణ కల్పిద్దాం

ముసునూరు: బాలికలు, మహిళలకు సమగ్ర రక్షణ కల్పించాలని ఐసీడీఎస్ నూజివీడు ప్రాజెక్టు సీడీపీఓ నూరాని పిలుపు నిచ్చారు. మండల కేంద్రం ముసునూరులో సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. 100 రోజుల స్పెషల్ కార్యక్రమాల్లో భాగంగా బాలికా సంరక్షణ, మహిళల రక్షణ, బేటీ బచావో - బేటీ పడావో, బాల్య వివాహాల నిలుపుదల, గర్భస్థ లింగనిర్ధారణ చట్టం, గృహ హింస చట్టాలతో పాటు, బాలికలు, మహిళల రక్షణకు హెల్ప్ లైన్ నంబర్లు 181, 1098, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు ధనలక్ష్మి, రాజ్యలక్ష్మి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

ఆగిరిపల్లి: ఆటో డ్రైవర్లు ప్రయాణ సమయంలో అప్రమత్తంగా ఉండాలని నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ కూడలి వద్ద ప్రమాదాల నివారణపై ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఆటో డ్రైవర్లు సరైన పత్రాలు కలిగి ఉండాలని, అతివేగంగా ప్రయాణించవద్దని, ఎక్కువ మంది ప్రయాణికులను ఎక్కించుకోరాదని, జాగ్రత్తలు పాటించి ప్రమాదాలను నివారించాలని ఆటో డ్రైవర్లకు సూచించారు. ఎస్ఐ సురేంద్ర కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

మల్లేల(తిరువూరురూరల్): మండలంలోని మల్లేల ఎంపీపీ పాఠశాలలో సోమవారం బాలికలపై లైంగిక దాడులు, అరాచకాలను వివరిస్తూ వీడియో ప్రదర్శన నిర్వహించారు. మల్లేల సచివాలయ మహిళా సంక్షేమ కార్యదర్శి పి. విజయలక్ష్మి ఆధ్వర్యంలో బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని రాఘవమ్మ, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, కల్యాణి, కిరణ్, శామ్యూల్ పాల్గొన్నారు.

కమిషనర్ దృష్టికి డివిజన్ సమస్యలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఐదో డివిజన్‌లో సమస్యలు పరిష్కరించాలని డివిజన్ కౌన్సిలర్ మొగిలి దయాసాగర్ కోరారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వై.శంకర్‌నాయక్‌ను సోమవారం మర్యాద పూర్వకంగా ఆయన కలిశారు. డివిజన్‌లోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. తొలుత గుడ్ మార్నింగ్ కొండపల్లి కార్యక్రమంలో భాగంగా పలు వీధుల్లో కౌన్సిలర్ పర్యటించి ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకుని కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కమిషనర్ తెలిపారు.

ఆక్రమణల తొలగింపునకు నోటీసుల జారీ

తిరువూరు: పట్టణంలోని ప్రధాన రహదారిలో డ్రెయినేజీలను ఆక్రమించి నిర్మించిన దుకాణాలను వెంటనే తొలగించాలని నగర పంచాయతీ కమిషనర్ లోవరాజు సోమవారం దుకాణదారులకు నోటీసులు జారీ చేశారు. ఆక్రమణల కారణంగా డ్రెయినేజీలను శుభ్రపరిచే అవకాశం లేక పారిశుద్ధ్య పరిస్థితులు ఇబ్బందికరంగా మారుతున్నాయని, బుధవారం లోపు ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించాలని కమిషనర్ నోటీసుల్లో పేర్కొన్నారు. ఇకపై డ్రెయినేజీలపై ఎటువంటి ఆక్రమణలకు పాల్పడినా శిక్షార్హులవుతారని హెచ్చరించారు.

ఆక్రమణలు పరిశీలించిన ఎమ్మెల్యే

తిరువూరు: తిరువూరు పట్టణంలోని మెయిన్‌రోడ్డులో డ్రెయినేజీలపై ఆక్రమణలను ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. డ్రెయినేజీలలో పూడిక తీయడానికి వీలు లేకుండా దుకాణాలు, బడ్డీకొట్లు, టీస్టాల్స్ ఏర్పాటు చేయడంతో మురుగు పేరుకుపోయి దోమల వ్యాప్తికి కారణమవుతోందని పట్టణ ప్రజలు ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేశారు. నగర పంచాయతీ కమిషనర్ లోవరాజుతో కలిసి ఎమ్మెల్యే ఈ ఆక్రమణలను పరిశీలించారు. వెంటనే ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతుబజారు, సర్దార్ పేటబాపయ్య షాపింగ్ కాంప్లెక్సు, మున్సిపల్ కూరగాయల మార్కెట్‌లను ఆయన పరిశీలించారు.

జ్వరంతో మహిళ మృతి

చాట్రాయి: చనుబండ గ్రామానికి చెందిన కంచు రామపుల్లమ్మ (33) జ్వరంతో మృతి చెందింది. వారం రోజుల నుంచి జ్వరంతో బాధ పడుతున్న ఆమె విస్సన్నపేట ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం పొందింది. ప్లేట్‌లెట్స్ పడిపోవడంతో విజయవాడ ప్రైవేటు ఆస్పత్రికి ఆదివారం తరలించారు. సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు మృతి చెందిందని ఆమె కుంటుంబీకులు తెలిపారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

విద్యారంగ సమస్యలపై వినతులు

ముసునూరు: రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు పద్మకిషోర్, కౌన్సిలర్ కాసాని గాంగేయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల అధికారులకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులను బోధనేతర విధుల నుంచి తప్పించాలని, హైస్కూల్స్‌లో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలని, మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలు పరిష్కారం తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు.

రచయిత నారాయణరెడ్డికి నివాళి

పెనుగొలను(గంపలగూడెం): ప్రముఖ రచయిత సింగిరెడ్డి నారాయణ జయంతి కార్యక్రమం పెనుగొలనులో షిర్డీ సాయి బాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విశాంత్ర ప్రొఫెసర్ రామాల నాగేశ్వరరావు, గ్రంథాలయ అధికారి జె. శ్రీలత, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు

● ఆర్డీఓ వై. భవానీశంకరి
● ప్రజల నుంచి 16 అర్జీల స్వీకరణ



అర్జీని పరిశీలిస్తున్న ఆర్డీఓ భవానీశంకరి

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (మీకోసం)లో వచ్చే అర్జీలను గడువులోగా పరిష్కరించాలని, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఆర్డీఓ వై.భవానీశంకరి అధికారులను హెచ్చరించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై వచ్చే అర్జీలను జాప్యం చేయకుండా సకాలంలో పరిష్కరించాలన్నారు. ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేస్తారని, దీంతో అర్జీ పరిష్కారమైందా, లేదా అనే విషయాన్ని కలెక్టర్ నుంచి సీఎం వరకు ఎప్పుడైనా చూడొచ్చని చెప్పారు.

పరిష్కారానికి వీలుకాకపోతే సంబంధిత కారణాన్ని చూపించాలన్నారు. మీ కోసంలో 16 అర్జీలు వచ్చాయని, వీటిలో ఎక్కువగా వ్యవసాయ భూముల సర్వే, పింఛన్ మంజూరు, రోడ్లకు మరమ్మతులు తదితర సమస్యలపై అర్జీలను ప్రజలు అందజేశారని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చిలుకూరి భాస్కరరెడ్డి, వ్యవసాయ శాఖ ఏడీ జి.విద్యాసాగర్, ఐసీడీఎస్ ఏసీడీపీఓ నాగేశ్వరి, ఉద్యాన అధికారి ఆర్. హేమ, డీఎల్‌డీఓ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

ఎ.కొండూరు: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ స్వాతి అన్నారు. గొల్లమందల గ్రామంలో సోమవారం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఆరోగ్య సిబ్బంది పర్యటించి దోమలు పెరిగే స్థలాలను గుర్తించి నిర్మూలనకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఫీవర్ సర్వే నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ బాలమురళీకృష్ణ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పూడిక తీత

ఎ.కొండూరు: చీమలపాడు గ్రామంలో సోమవారం రహదారికి ఇరువైపులా పూడిక తీత పనులు చేపట్టారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమల మందు ఫాగింగ్ చేశారు. వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టారు. తాగునీటిని క్లోరినేషన్ చేయించారు. పాఠశాల ఆవరణలో వర్షం నీటిని తొలగించారు. పనులను సర్పంచ్ మోర్ల లక్ష్మి పర్యవేక్షించి మాట్లాడారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఆమె చెప్పారు.

● ఆగిరిపల్లి: మండలంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా మండలంలో ఆగిరిపల్లి, సీతారాంపురం, నరసింగపాలెం, చిన్నాగిరిపల్లి, పినమరెడ్డిపల్లి గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేశామని ఈఓపీఆర్డీ శేఖర్ తెలిపారు. గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది వీధులను శుభ్రం చేయడం, రోడ్ల వెంట ఉన్న చెత్తను తొలగించడం, కాలువల్లో దోమల మందు పిచికారీ, రక్షిత మంచి నీటి పథకం వాటర్ ట్యాంకులను క్లోరినేషన్ చేయించామని వివరించారు.

● లక్ష్మీపురం(తిరువూరురూరల్): వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా పరిసరాల పరిశుభ్రత పాటించాలని లక్ష్మీపురం సర్పంచి గొల్లమందల శ్రీనివాసరావు అన్నారు. గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మురుగునీటి పారుదలకు వీలుగా కచ్చా డ్రెయిన్లు తవ్వుకోవాలని, వీధుల్లో చెత్తాచెదారం వేయవద్దని సూచించారు. పంచాయతీ కార్యదర్శి రవికాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



చనుబండలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న షర్మిష్ట

చాట్రాయి: పరిసరాల పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులను నివారించవచ్చునని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి షర్మిష్ట అన్నారు. సోమవారం మండలంలోని చనుబండ గ్రామంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించి మాట్లాడారు. జ్వరాలకు ఎక్కువ డోసు మందులు ఇవ్వడం వల్ల కూడా ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయని, తాగునీరు కలుషితం వల్ల డయేరియా వ్యాప్తి చెందుతుందని అన్నారు. జిల్లాలో డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు 104 డెంగీ కేసులు నమోదయ్యాయని చెప్పారు. జ్వరాలకు ఎక్కువ డోసు మందులు ఇవ్వవద్దని ప్రైవేటు డాక్టర్లు, ఆర్ఎంపీలకు నోటీసులు ఇచ్చామని చెప్పారు. అనంతరం స్థానిక జెడ్పీ హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆర్వో ప్లాంటు ద్వారా శుభ్రమైన తాగు నీటిని విద్యార్థులకు అందించాలని హెచ్ఎం సత్యనారాయణకు సూచించారు. కార్యక్రమంలో డెప్యూటీ డీఎంహెచ్ఓ ఆర్. లక్ష్మీనారాయణ, డీఎస్ఓ నరేంద్ర కృష్ణ పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సహకరించండి

ఎంపీపీ గోళ్ల అనూష



మాట్లాడుతున్న ఎంపీపీ అనూష

ఆగిరిపల్లి: పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ అధికారుల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేద్దామని ఎంపీపీ గోళ్ల అనూష అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా అధికారులు అభివృద్ధి నివేదికను వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో ప్రజా సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలన్నారు. అభివృద్ధి బాటలో ముందుకు పోవాలని చెప్పారు. ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరిస్తూ పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శామ్యూల్, జెడ్పీటీసీ సభ్యులు పిన్నిబోయిన వీరబాబు, వైస్ ఎంపీపీ కొండవరదల రమేష్, ఈఓపీఆర్డీ శేఖర్, ఏఓ అబ్దుల్ సలాం, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.